అదనపు భారం తగ్గేనా?

- ఒక్కో కంప్యూటర్ ఆపరేటర్‌కు 8 గ్రామ పంచాయతీల బాధ్యత
- అమలుకు నోచుకోని జీఓ 14
- ఇబ్బందుల్లో ఈ–పంచాయతీ ఆపరేటర్లు
- పనికి తగిన వేతనమివ్వాలని విన్నపం



ఎంపీడీఓ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు

మునిపల్లి(అందోల్): ప్రభుత్వ పథకాల అమలు, పంచాయతీల పాలనపరమైన ప్రతి అంశాన్ని కంప్యూటర్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. అందుకుగాను నియమించిన ఈ– పంచాయతీ ఆపరేటర్లు అదనపు పనిభారంతో సతమతమవుతూ విధులు నిర్వహిస్తున్న పరిస్థితి నెలకొంది. ఒక్కో క్లస్టర్ పరిధి ఆపరేటర్‌కు 8 నుంచి 10 వరకు ఈ–పంచాయతీల బాధ్యతలను చూస్తున్నారు. తమ ఆర్థిక పరిస్థితులు, విధి నిర్వహణ ప్రాధాన్యతను గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని కంప్యూటర్ ఆపరేటర్లు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

2015 నుంచి ఈ–పంచాయతీ వ్యవస్థ అమలు

- ప్రస్తుతం 67 మంది కంప్యూటర్ ఆపరేటర్లు విధులు నిర్వహిస్తున్నారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సాయంతో పాలనను పరుగులు పెట్టించాలనే ఉద్దేశ్యంతో ఈ–పంచాయతీలను 2015లో అప్పటి ప్రభుత్వం ఏర్పాటు చేసింది.
- 2015లో కార్వీస్ సంస్థ ఆధ్వర్యంలో ఈ–పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లను ఎంపిక చేశారు. 2016లో గ్రామ పంచాయతీల నుంచే వేతనాలు మంజూరు చేయాలని అప్పటి ప్రభుత్వం ఉత్తర్వులను సైతం జారీ చేసింది.
- ఒక్కో క్లస్టర్ (ఎంపీటీసీ పరిధి)కి ఒక కంప్యూటర్, స్కానర్, ప్రింటర్‌తో పాటు తదితర సామగ్రిని ప్రభుత్వం మంజూరు చేసింది.
- కంప్యూటర్ ఆపరేటర్లంతా ఎంపీడీఓ కార్యాలయంలోనే గ్రామ పంచాయతీలకు సంబంధించిన వివరాలన్నంటిని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు.
- ప్రతి క్లస్టర్‌కు ఒక కంప్యూటర్ ఆపరేటర్ ఉండాల్సి ఉండగా ఆపరేటర్లు తక్కువ ఉండటంతో ఇబ్బందులు తలెత్తడమే కాకుండా కంప్యూటర్లు నిరుపయోగంగా మారాయని, క్షేత్రస్థాయిలో అధికారుల నిర్లక్ష్యమే దీనికి ప్రధాన కారణమని ఆరోపణలు ఉన్నాయి.

రూ.19,500 అందజేస్తున్నాం



జిల్లాలో సుమారు 281 ఈ–పంచాయతీ ప్రతి క్లస్టర్‌కు కంప్యూటర్లు, స్కానర్లను ప్రభుత్వం పంపిణీ చేసింది. 55 మంది సీనియర్లు కాగా కొత్తగా మరో 12 మంది కంప్యూటర్ ఆపరేటర్లు పని చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒక్కో కంప్యూటర్ ఆపరేటర్‌కు రూ.19.500 చొప్పున వేతనం అందజేస్తున్నాం.

– సురేష్‌మోహన్ (డీపీఓ)

ఉద్యోగ భద్రత కల్పించాలి



కంప్యూటర్ ఆపరేటర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి. జనన, మరణ, పంచాయతీల లావాదేవీల వంటి అనేక సేవలను అందిస్తున్న ఈ–పంచాయతీ ఆపరేటర్లకు జీఓ 14 ప్రకారం ఉద్యోగ భద్రత, పనికి తగిన వేతనాలను అందజేయాలి.

– సాయిబాబా, క్లస్టర్ కంప్యూటర్ ఆపరేటర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు

కార్మికులను పర్మినెంట్ చేయాలి



పరిశ్రమ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

కొండాపూర్(సంగారెడ్డి): మండల పరిధిలోని మల్లేపల్లి ఎస్‌జీ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని పరిశ్రమ యూనియన్ అధ్యక్షుడు సాయిలు డిమాండ్ చేశారు. కార్మికులకు ఇచ్చిన హామీలతో పాటు పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్‌జీ పరిశ్రమ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సాయిలు మాట్లాడుతూ ప్రొడక్షన్‌లో పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయడంతో పాటు యూనిఫాం, క్యాంటీన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. పరిశ్రమ యాజమాన్యం యూనియన్ ఆధ్వర్యంలో కార్మికుల వేతనాలు ఇతర సమస్యలు పరిష్కారంపై చర్చలు నిర్వహించి ఎనిమిది నెలలైనా యాజమాన్యం పట్టించుకోవడం లేదన్నారు. స్థానికంగా ఉన్న కార్మికులకు తక్కువ వేతనమిస్తూ ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారికి ఎక్కువ వేతనాలు ఇస్తూ కార్మికుల మధ్య విభజన చేసి శ్రమదోపిడీకి పాల్పడుతోందని మండిపడ్డారు. కార్మికుల నిరసనకు యూబీ గోల్కొండ, క్రౌన్ కాల్స్‌వర్క్ యూనియన్ల నాయకులు, కార్మికులు మద్దతు తెలిపారు. అనంతరం పరిశ్రమ యాజమాన్యానికి డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో యూబీ గోల్కొండ ఎంప్లాయిస్ యూనియన్ జనరల్ సెక్రెటరీ రాందాస్, క్రౌన్ యూనియన్ జనరల్ సెక్రెటరీ రమేష్, కాల్స్‌బర్గ్ యూనియన్ జనరల్ సెక్రెటరీ దయానంద్, నాయకులు శ్రీధర్‌గౌడ్, మోహన్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, అలీ, పాండు, సీఐటీయూ మండల నాయకులు రాజయ్య, నరసింహారెడ్డి ఎస్‌జీ యూనియన్ నాయకులు మల్లేశం, లక్ష్మీకాంత్‌గౌడ్, ప్రభాకర్, ఫయాజ్, రవి, కార్మికులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: విద్యుదాఘాతంతో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లాకు చెందిన ఏసుదాసు బతుకుదెరువు కోసం అమీన్‌పూర్‌కు వచ్చి మేస్త్రి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో అమీన్‌పూర్ పరిధిలోని పీఎస్‌ఆర్ కాలనీలో శ్రీనివాసరావు అనే వ్యక్తి నిర్మిస్తున్న పెంట్ హౌస్ వద్ద ఈ నెల 30వ తేదీన పని చేసేందుకు మేస్త్రీలతో కలిసి వెళ్లాడు. అయితే వీరితో పాటు ఏసుదాసు అన్న కొడుకు నిహామీయ(14) వచ్చి పనిచేసే చోట మట్టిపై కూర్చున్నాడు. ఈ క్రమంలో పెంట్ హౌస్ పనులను పరిశీలించేందుకు వచ్చిన యజమాని శ్రీనివాసరావు పనిచేసే చోట రెండో అంతస్తు నుంచి ఇనుప రాడ్డును నిహామీయతో కలిసి కిందకు వేసే క్రమంలో పక్కనే ఉన్న విద్యుత్ వైర్లు రాడ్డుకు తగిలి షాక్ తగలడంతో ఇరువురు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే ఇద్దరిని చికిత్స నిమిత్తం చందానగర్‌లోని మెడికవర్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శ్రీనివాసరావు మృతి చెందాడు. నిహామీయ చికిత్స పొందుతున్నాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

గాంధీజీ సేవలు చిరస్మరణీయం

జిల్లావ్యాప్తంగా మహాత్మాగాంధీ వర్ధంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు గాంధీజీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ స్వాతంత్య్రం కోసం అహింసా పద్ధతిలో మహాత్మాగాంధీ చేసిన పోరాటం మరువలేనిదని కొనియాడారు. ప్రతిఒక్కరూ ఆయన చూపిన మార్గంలో పయనించాలని పిలుపునిచ్చారు.



పటాన్‌చెరు టౌన్: మహాత్మాగాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు



రామచంద్రాపురం: మహాత్మాగాంధీ వర్ధంతిలో పాల్గొన్న కార్పొరేటర్ సింధురెడ్డి, నాయకులు



నారాయణఖేడ్: మహాత్మాగాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



సంగారెడ్డి టౌన్: గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



రామచంద్రాపురం: జాతిపిత గాంధీజీ వర్ధంతిలో పాల్గొన్న కార్పొరేటర్ పుష్ప, నాయకులు

క్లుప్తంగా

షీ–టీమ్ బోర్డులను ఏర్పాటు చేయండి



సీఐ ప్రవీణ్‌రెడ్డికి జ్ఞాపికను బహూకరిస్తున్న నాయకులు

పటాన్‌చెరు టౌన్: విద్యాసంస్థలు, బస్టాపుల వద్ద షీ–టీమ్ నెంబర్ బోర్డులను ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నరసింహారెడ్డి అన్నారు. ఈ మేరకు పటాన్‌చెరు సీఐ ప్రవీణ్‌రెడ్డిని పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఐకి బుద్ధుడి జ్ఞాపికను బహూకరించారు. అనంతరం నరసింహారెడ్డి మాట్లాడుతూ విద్యాసంస్థలు, బస్టాపుల వద్ద విద్యార్థినులు, మహిళలు ఏదైనా అసౌకర్యానికి గురైతే తక్షణమే స్థానిక పోలీసు సిబ్బంది, షీ–టీం నెంబర్లను సంప్రదించే అవకాశం ఉంటుందన్నారు. అదేవిధంగా కాలనీలలో, పారిశ్రామికవాడలో గస్తీని పెంచాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కుంచాల కిషన్, యువరాజ్ మోరే, అబ్దుల్ హమీద్, రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వీల్‌చైర్లు అందజేత



వీల్‌చైర్‌ను అందజేస్తున్న అనుపమారెడ్డి

నారాయణఖేడ్: మండల పరిధిలోని మాద్వార్‌కు చెందిన భవానీ, పోతన్‌పల్లికి చెందిన ఉప్పరి సాయమ్మకు ఎమ్మెల్యే సంజీవరెడ్డి సతీమణి అనుపమారెడ్డి మా ఇల్లు స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు తోపాజి అనంతకిషన్, వాసవీ క్లబ్ మాజీ గవర్నర్ జూకంటి లక్ష్మణ్‌గుప్తా సౌజన్యంతో వీల్‌చైర్లను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా అనుపమారెడ్డి మాట్లాడుతూ బాధితులకు అన్నివిధాలుగా అండగా ఉంటామని హామీనిచ్చారు.

ఆల్‌ఇన్‌వన్ గైడ్స్ పంపిణీ



విద్యార్థులకు గైడ్స్ పంపిణీ చేస్తున్న రామప్ప

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని తడ్కల్, కంగ్టి షెడ్యూల్డ్ కులాల వసతి గృహాల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన ఆల్ ఇన్ వన్ గైడ్స్‌ను హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ రామప్ప మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మూడు నెలల కాస్మొటిక్ చార్జీలను అందజేసినట్లు తెలిపారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



వాహనదారులతో మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ రామకృష్ణారెడ్డి

పటాన్‌చెరు టౌన్: క్రషర్ల నుంచి డస్ట్‌ను తరలించే టిప్పర్ వాహనదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని, నిబంధన పాటించని వారిపై చర్యలు తప్పవని పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ రామకృష్ణారెడ్డి హెచ్చరించారు. జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని లక్డారం జాతీయ రహదారిపై టిప్పర్ డ్రైవర్లకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ డస్ట్‌ను తరలించే వాహనాదారులు తప్పనిసరిగా మ్యాట్‌తో కవర్ చేయాలని సూచించారు. ట్రాఫిక్ ఎస్‌ఐలు, సిబ్బంది, డ్రైవర్లు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



అక్రమ నిర్మాణాలను కూల్చివేయిస్తున్న రెవెన్యూ అధికారి

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని ఖాజీపల్లి గ్రామంలోని 181 సర్వేనంబర్‌లోని ప్రభుత్వ భూమిలో చేపడుతున్న అక్రమ నిర్మాణాలను తహసీల్దార్ రవికుమార్ ఆదేశాల మేరకు ఆర్‌ఐ జయప్రకాశ్ నారాయణ కూల్చివేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ భూములను అక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సర్కార్ బడుల్లోనే నాణ్యమైన విద్య

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: సర్కార్ బడుల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండల పరిధిలోని రామేశ్వరంబండ గ్రామంలో రూ.1,20కోట్ల వ్యయంతో నిర్మించిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనం, రూ.60లక్షలతో వీకర్ సెక్షన్ కాలనీలో నిర్మించిన సీసీ రోడ్లను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో మన ఊరు–మనబడి పథకం ద్వారా విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకువచ్చినట్లు తెలిపారు. సరిపడా సిబ్బంది, ఆధునిక వసతులు కల్పిస్తున్నా నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ సుష్మాశ్రీ, జెడ్పీటీసీ సుప్రజ, సర్పంచ్ ధరణి అంతిరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, సీనియర్ నాయకులు అంతిరెడ్డి, దశరథరెడ్డి, వెంకట్‌రెడ్డి, గ్రామ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యం

ఎమ్మెల్యే సంజీవరెడ్డి



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. ఖేడ్‌లో మంగళవారం పట్లోళ్ల కిష్టారెడ్డి ట్రస్టు, లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో హైదరాబాద్ హోలిస్టిక్ ఆస్పత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ వాసులకు ఉచిత వైద్య సహాయం అందించాలనే ఉద్దేశ్యంతో శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. దాదాపు 1,200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందజేసినట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే సంజీవరెడ్డి వైద్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, హోలిస్టిక్ వైద్యశాల కోఆర్డినేటర్ చిరంజీవి, బంజారా సేవాలాల్ సంఘం అధ్యక్షుడు రమేష్ చౌహాన్, న్యాయవాది భోజిరెడ్డి, సంగన్న, మాజీ ఎంపీపీ సత్యనారాయణ, తాహెర్‌అలీ, ఈశ్వరప్ప, లయన్స్ క్లబ్ బాధ్యులు పాల్గొన్నారు.

గద్దర్ విగ్రహావిష్కరణను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న కౌన్సిలర్ భరత్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రజాగాయకుడు గద్దర్ జయంతి సందర్భంగా ఈ నెల 31న తెల్లాపూర్‌లో ఏర్పాటు చేయనున్న గద్దర్ విగ్రహావిష్కరణను విజయవంతం చేయాలని తెల్లాపూర్ స్వతంత్ర కౌన్సిలర్ కొల్లూరి భరత్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బుధవారం సాయంత్రం నిర్వహించనున్న గద్దర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, పర్యావరణ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, ప్రొఫెసర్ కంచ ఐలయ్య, బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, రాష్ట్ర ట్రేడ్ యూనియన్ సీనియర్ నాయకులు కొల్లూరి సత్తయ్యతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. గద్దర్ విగ్రహావిష్కరణకు ప్రజలు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

గృహ నిర్మాణాలకు భూమిని కేటాయించండి

ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పారిశ్రామికవాడలోని ఏషియన్ పెయింట్స్ పరిశ్రమ కార్మికులు రిజిస్టర్ హౌసింగ్ సొసైటీని ఏర్పాటు చేసుకున్నారని, వారి ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం భూమిని కేటాయించాలని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి అన్నారు. పటాన్‌చెరు తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం సందర్శించిన కలెక్టర్ క్రాంతిని కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నరసింహరెడ్డి మాట్లాడుతూ పటాన్‌చెరు పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వ భూమిని ఐదు నుంచి పది ఎకరాల భూమిని ప్రభుత్వం నిర్ణయించిన ధరకు హౌసింగ్ సొసైటీకి కేటాయించాలని కలెక్టర్‌కు వినతిపత్రంలో కోరినట్లు తెలిపారు. కలెక్టర్‌ను కలిసినవారిలో కాంగ్రెస్ నాయకులు కుంచాల కిషన్, కార్మిక సంఘం నాయకులు చంద్రమౌళి, శ్రీధర్, రాజశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నోట్ పుస్తకాలు పంపిణీ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఉమ్మడి మెదక్ జిల్లా మాజీ ఎస్టీయూ టీఎస్ ప్రధాన కార్యదర్శి, రిటైర్డ్ ఉపాధ్యాయులు రాజ మల్లయ్య తన సొంత నిధులతో మంగళవారం బీహెచ్‌ఈఎల్ జిల్లా పరిషత్, పాఠశాల విద్యార్థులకు నోట్‌పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎస్టీయూ మండల శాఖ ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు దామోదర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజమల్లయ్య తనకు వచ్చే పెన్షన్‌లోని కొంత డబ్బును పేద విద్యార్థులకు ఖర్చు చేయడం సంతోషకరమన్నారు. ప్రతిఒక్కరూ రాజమల్లయ్యను ఆదర్శంగా తీసుకొని పేద విద్యార్థులకు సాయం చేయాలని సూచించారు.

నిషేధిత సిగరేట్ ప్యాకెట్ల స్వాధీనం

జహీరాబాద్: నిషేధిత సిగరేట్ల వ్యాపారం నిర్వహిస్తున్న కేంద్రంపై జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం ఆకస్మికంగా దాడులు నిర్వహించి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని శాంతినగర్ కాలనీలో ఖదీర్ టేస్టీ చాలియా కిరాణ దుకాణం నిర్వహిస్తున్నాడు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ప్రభుత్వ నిషేధిత సిగరేట్లను అమ్ముతున్నాడు. విషయం తెలుసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి ఖదీర్‌ను అదుపులోకి తీసుకుని 236 సిగరేట్ బాక్సులను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న సిగరేట్ డబ్బాలను జహీరాబాద్ పట్టణ పోలీసుస్టేషన్‌కు తరలించారు.

కుష్ఠు వ్యాధిగ్రస్తులకు పండ్లు పంపిణీ

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని బీదర్ చౌరస్తాలో ఉన్న కుష్ఠు నివారణ కేంద్రంలో వ్యాధిగ్రస్తులకు దుస్తులు, పండ్లను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ పారామెడికల్ అధికారి మారుతి మాట్లాడుతూ కుష్ఠు వ్యాధిగ్రస్తులను చిన్నచూపు చూడొద్దని, వారిని ఆదుకునేందుకు ప్రతిఒక్కరూ ముందుకురావాలని సూచించారు. ఈ జనవరిలో నిర్వహించిన సర్వేలో ఉమ్మడి మెదక్ జిల్లాలో కొత్తగా 109 మంది కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించామన్నారు. వీరిలో 80 మంది చికిత్స తీసుకుంటున్నారని తెలిపారు. జిల్లాలో 39 మంది వరకు కొత్తగా చికిత్స పొందుతున్నారన్నారు. కుష్ఠు వ్యాధి లక్షణాలు కలిగి ఉన్నవారికి ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా మందులను అందజేస్తున్నట్లు తెలిపారు. పారామెడికల్ అధికారులు, సిబ్బంది ప్రతాప్‌గౌడ్, రమణ, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.